ఆనందమనిపింఛన్

- వేకువజామునే లబ్ధిదారుల చేతికి వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేత
- జోన్–5లో 83 శాతం పూర్తి



కంచరపాలెంలో అవ్వకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్, సచివాలయ కన్వీనర్



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అప్పారావు

కంచరపాలెం: ప్రతి నెలా ఒకటో తేదీనే వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తోంది. జీవీఎంసీ జోన్–5 పరిధిలో శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం చురుగ్గా చేపట్టారు. వేకువజామున ఇళ్ల వద్దకే వచ్చి పెన్షన్ సొమ్ము చేతికి అందించడంతో అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్తర నియోజకవర్గ పరిధి 13 వార్డులకు సంబంధించి టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులు, ఇతరత్రా పెన్షన్లను పంపిణీ చేసినట్లు జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. వలంటీర్లు వేకువజామున మంచుకురిసే వేళలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు.

13,468 మందికి పింఛన్ల పంపిణీ

జోన్–5 పరిధిలోని ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 14,841 మంది పింఛన్‌దారులకు గానూ తొలి రోజు 13,468 మందికి పెన్షన్లు అందించారు. సుమారు రూ.4.39 కోట్ల నగదు విడుదలైంది. మొదటి రోజు సుమారు 83 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు యూసీడీ ఏపీడీ పద్మావతి తెలిపారు. లబ్ధిదారులకు సచివాలయ కార్యదర్శుల సమక్షంలో వలంటీర్లు పింఛన్లు అందించారు. ఇళ్ల వద్దకే కాకుండా ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పెన్షనర్ల వద్దకు వెళ్లి వారికి పింఛన్ అందజేశారు. శనివారానికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు. జోన్–5 ఏపీడీ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆయన సూచించారు.

తొలి రోజు పింఛన్ అందుకున్న వారి వివరాలు

వార్డు నం.	లబ్ధిదారులు	వార్డు నం.	లబ్ధిదారులు
42	841	49	1,321
43	1,452	50	652
44	1,220	51	902
45	841	53	712
46	1,358	54	847
47	1,199	55	913
48	1,210	---	---

మాధవస్వామిని దర్శించుకున్న సనపల చంద్రమౌళి



వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళికి అభినందనలు తెలుపుతున్న కె.కె.రాజు



మాధవస్వామి సన్నిధిలో కుటుంబ సభ్యులతో సనపల చంద్రమౌళి

మద్రిపాలెం: వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా నియమితుడైన సనపల చంద్రమౌళి ప్రమాణ స్వీకారం చేసే క్రమంలో ముందుగా 51వ వార్డు మాధవధార మాధవస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. ఏ ప్రభుత్వంలో కూడా ఇంతమంది బీసీలకు అధికారిక పోస్టులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా కలిసి మళ్లీ వైఎస్ జగన్‌ను గెలిపించుకోవాలని కోరారు. ఆలయంలో చంద్రమౌళికి కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ రమణమూర్తి, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రముఖుల అభినందనలు : మాధవ స్వామి ఆలయం నుంచి భారీ ర్యాలీగా ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న సనపల చంద్రమౌళిని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాధవధార జంక్షన్‌లో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయం వరకు ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పార్టీ సీనియర్ నాయకులు, వార్డు నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

సీతంపేట: వీఎంఆర్‌డీఏ నూతన చైర్మన్ సనపల చంద్రమౌళిని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌సీసీ శిక్షణకు విద్యార్థుల ఎంపిక



శిక్షణకు ఎంపికైన ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో 2024–26 సంవత్సరానికి ఎన్‌సీసీ శిక్షణకు ఎంపిక జరిగింది. ఎన్‌సీసీ ప్రథమ శ్రేణి ఉన్నతాధికారి ఎం.ఎస్.విశ్వనాథం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎంపికలో 24 మంది విద్యార్థులకు కొత్తగా అవకాశం లభించింది. పాఠశాలలో 7, 8 తరగతులు చదువుతున్న 200 మంది ఉత్సాహవంతులైన విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా.. 14 మంది బాలికలు జూనియర్ వింగ్‌గా, 10 మంది బాలురు జూనియర్ డివిజన్‌గా ఎంపికయ్యారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనరస, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయ్‌కుమార్, సుబేదార్ మేజర్ సజీవన్ కేకే, హవల్దార్ శుక్ర, హవల్దార్ శ్యామలరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా చందనోత్సవం



చాదర్‌ను దర్శించుకుంటున్న కె.కె.రాజు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో శుక్రవారం హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. పవిత్ర నమాజ్‌ను ఆచరించిన ముస్లింలు మసీదు ప్రాంగణంలో ఖురాన్ పఠించారు. అనంతరం మద్రిపాలెంలోని పార్వతీనగర్, గ్రీన్‌గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో చాదర్(పవిత్ర వస్త్రం)తో చందనోత్సవ ర్యాలీ చేసి నిషాని వద్ద ఫతేహా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, కార్పొరేటర్ బర్కత్ అలీ చాదర్‌ను దర్శించుకున్నారు. కార్యక్రమాన్ని మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మున్న, ఉర్స్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చురుగ్గా రేషన్ పంపిణీ



రేషన్ సరకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులో శనివారం రేషన్ సరకులు చురుగ్గా పంపిణీ చేశారు. ఇళ్ల వద్దకు వెళ్లి తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు సరకులు, పంచదార అందించారు. ఈ నెల 10 వరకు ప్రజలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తామని సిబ్బంది తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఇందిరానగర్‌లో పనులు పరిశీలిస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం ఇందిరానగర్, శ్రీనివాస్‌నగర్, జైభారత్ నగర్, బాపూజీనగర్, శివలింగపురం తదితర కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొండవాలులో మెట్ల మార్గాలు, డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టారు. కార్పొరేటర్ గంకల కవితా అప్పారావు జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి శుక్రవారం అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆమె సూచించారు.

కాగితం పూల సోయగం



డివైడర్ మధ్యలో కనువిందు చేస్తున్న కాగితం పూల మొక్కలు

సీతమ్మధార: జాతీయ రహదారిపై సత్యం జంక్షన్ నుంచి మద్దిలపాలేనికి వెళ్లే మార్గం డివైడర్ మధ్యలో జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన కాగితల పూల మొక్కలు వాహనచోదకులు, పాదచారులను ఆకట్టుకుంటున్నాయి. రెండు కిలో మీటర్ల వరకు దారిపొడవునా సుందరంగా కనిపిస్తున్నాయి. కాలుష్యంతో నిండి ఉండే ఈ ప్రాంతంలో పచ్చదనం పెంపుతో కార్బన్ డయాక్సైడ్ శాతం గణనీయంగా తగ్గుతుందని పర్యావరణ వేత్తలు భావిస్తున్నారు. ఎప్పుడూ రణగణ ధ్వనులతో గజిబిజిగా ఉండే సత్యం జంక్షన్ ప్రాంతం... పచ్చని మొక్కలతో ఆహ్లాదకరంగా మారింది.

‘గ్రీవెన్స్’తో వినతుల పరిష్కారం



ప్రజా వినతులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేసి విన్నవించారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్ని అర్జీలను తక్షణం పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న స్వామి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో గల అభయాంజనేయ స్వామి గుడి 15వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రామారావు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, పంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

సందడిగా ఇంటర్ పరీక్షా కేంద్రాలు



బుల్లయ్య కళాశాలలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

సీతంపేట: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు సంస్కృతం, తెలుగు పరీక్ష జరిగాయి. ఉదయం ఎనిమిది గంటలకే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవడంతో అవి సందడిగా కనిపించాయి. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ, బీవీకే కళాశాల, శ్రీవిశ్వ కళాశాలల తదితర కేంద్రాల్లో ఫస్టియర్ విద్యార్థులు పరీక్షలు రాశారు.

నరసింహస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

సీతంపేట: మాఘ మాసం స్వాతి నక్షత్రం సందర్భంగా శుక్రవారం లలితానగర్ లలితా పీఠంలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామికి విశేష అభిషేకం, అర్చన చేశారు. అనంతరం తులసి మాలలతో అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. బహుళ అష్టమి సందర్భంగా ఆదివారం ఉదయం 9.30 గంటలకు పీఠంలో చండీ హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. సాయంత్రం 7 గంటలకు కాలభైరవ హోమం నిర్వహిస్తామన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



ఈవో శ్రీనివాసమూర్తికి చెక్కు అందజేస్తున్న దాత వెంకటేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం నగరంలోని సీతంపేటకు చెందిన కరణం వెంకటేశ్వరరావు రూ1,00,116 విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కును సింహగిరిపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరుపున దాతకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

కనుల పండువగా పార్వతీశ్వరుడి ఊరేగింపు



ప్రత్యేక రథంపై పార్వతీశ్వరుడు

సీతంపేట: స్థానిక పార్వతీశ్వరాలయంలో జరుగుతున్న 34వ వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం మేళతాళాలతో సారెతో పార్వతీశ్వరుల ఉత్సవ మూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారిని వేజేంపజేసి, మహిళలు సారెతో వెంటరాగా సీతంపేట వీధుల్లో ఊరేగింపు కడు రమ్యంగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ అర్చకులు గంగవరపు శివాజీ శర్మ, భాస్కరశర్మ, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చకచకా డ్రెయిన్ల నిర్మాణం



అబిడ్‌నగర్ రోడ్డులో నిర్మిస్తున్న డ్రెయిన్

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డులో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. సుమారు రూ.38.46 లక్షలతో అబిడ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ నుంచి అబిడ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న డ్రెయిన్లు పూడుకుపోవడం, గట్లు శిథిలం కావడంతో పాత డ్రెయిన్లు తొలగించారు. గోడలు కట్టాక మూడడుగుల వెడల్పు ఉండేలా పాత డ్రెయిన్లను విస్తరించి, బాటంలో శ్లాబ్ వేసి, రెండువైపులా కాంక్రీట్ గోడలు నిర్మిస్తున్నారు. ఈ విధంగా డ్రెయిన్లు నిర్మించడం వల్ల పటిష్టంగా ఉంటాయని సిబ్బంది తెలిపారు. అబిడ్‌నగర్‌లో డ్రెయిన్ల పునర్నిర్మాణం జరుగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల్లో వెలమలకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

సీతంపేట: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం 5 పార్లమెంట్, 25 అసెంబ్లీ సీట్లు అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బీవీకే కళాశాల సమీపంలోని ఒక హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన వెలమ సామాజిక వర్గానికి దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో వెలమలకు ప్రాధాన్యమిచ్చి విశాఖలో ఉత్తర, దక్షిణ అసెంబ్లీ స్థానాలు, అనకాపల్లి, చోడవరం, పెందుర్తి అసెంబ్లీ స్థానాలు, విజయనగరం జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని కోరారు. వెలమ సంఘానికి విశాఖలో రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, వెలమ సామాజిక వర్గాన్ని బీసీ ×డీ జాబితా నుంచి బీసీ ‘ఏ’ జాబితాలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్‌కుమార్, కొరుపల్లి పరపునాయుడు, రెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

బుల్లయ్య కాలేజీ విద్యార్థుల సైకిల్ రైడ్



సైకిల్ రైడ్‌ను ప్రారంభిస్తున్న బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం కాలేజీ విద్యార్థులు సైకిల్స్‌పై ప్రయాణించి ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. కళాశాల నుంచి ప్రారంభమైన సైక్లింగ్ రైడ్ జగదాంబ, కలెక్టర్ ఆఫీస్, బీచ్ రోడ్, వీఎంఆర్‌డీఏ పార్క్, ఏయూ, సీఎంఆర్ జంక్షన్ వరకు సుమారు 8.5 కిలో మీటర్ల మేర నిర్వహించారు. ఈ రైడ్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.మధుకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం శారీరక వ్యాయామాలు చేయడం, సైకిల్ తొక్కడం ద్వారా ఫిట్‌నెస్ స్థాయిలను మెరుగుపర్చుకోవాలని సూచించారు.

పోలీస్ స్టేషన్‌లో కిక్కిరిసిన వాహనాలు



ద్విచక్ర వాహనాలతో నిండిపోయిన పోలీస్ స్టేషన్ ఆవరణ

సీతమ్మధార: పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలతో పోలీస్ స్టేషన్ నిండిపోయింది. ద్వారకా, ఫోర్త్‌టౌన్ క్రైం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు సంబంధించి కొంత కాలంగా ప్రమాదాలు, చైన్ స్నేచింగ్, దొంగతనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలు నెలలు తరబడి స్టేషన్ ఆవరణలో పడి ఉన్నాయి. ఈక్రమంలో వాహనాల టైర్లు, ఇతర సామగ్రి పాడైపోవడంతో దేనికి పనికిరాకుండా పోతున్నాయి. పట్టుబడిన వారు కోర్టులో హాజరై శిక్ష పూర్తి చేసుకున్న తర్వాతనే వారికి తిరిగి వాహనాలను ఇస్తారు. ఈ నేపథ్యంలో ఏళ్లు గడిచిపోతుండటంతో కొంత మంది స్టేషన్‌లోనే తమ వాహనాలను వదిలేసే పరిస్థితి నెలకొంది. రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరిగి స్టేషన్ ఆవరణలో నిండిపోతున్నాయి.

ట్రయథ్లాన్‌లో వంశీకిరణ్ ప్రతిభ

సీతంపేట: ఇండియన్ నేవీ సర్వీసెస్ వారిచే ఇటీవల లోనవాలలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ట్రయథ్లాన్ పోటీలో లంకపల్లి బుల్లయ్య కళాశాల బీఎస్సీ థర్డ్ ఇయర్ విద్యార్థి కె.వంశీకిరణ్ ప్రతిభ చూపి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ వంశీకిరణ్‌ను అభినందించారు.

గొడవలో ఒకరికి గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరుగుపొరుగు వారు గొడవ పడటంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం జీఎస్ఎస్‌యూఆర్‌ఎం కాలనీలో నివసిస్తున్న జి.దుర్గారావుకు ఇరుగుపొరుగున నివసించే వారికి గొడవ జరిగింది. మాటా మాటా పెరగడంతో దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో దుర్గారావుకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అతడి భార్య జి.ప్రమీల గురువారం రాత్రి ఫిర్యాదు చేయడంతో సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

నైపుణ్యాలతో మెరుగైన అవకాశాలు సాధ్యం

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని, అప్పుడు మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన యాత్రిక 2కే24 సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మార్కులు అవసరమే కానీ.. అవే ప్రధానం కాదన్నారు. నైపుణ్యాలు, ప్రత్యేక సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ, బ్లాక్‌చైన్, ఎంఐ, ఐవోటీ, ఇండస్ట్రీ 4.0 వంటి సాంకేతికతలను అన్ని శాస్త్రాలతో మిళితం చేస్తూ ఉపయుక్తంగా నిలుపుకోవాలని సూచించారు. శాస్త్ర అంశాలను నేర్చుకోవడంతో పాటు వాటిని నిత్య జీవితంలో అన్వయించడం ఎంతో అవసరమన్నారు. నూతనంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్రాలను, సాంకేతికతను యువతకు అలవాటు చేస్తూ వారిని భవిష్యత్తుకు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు. ఎడ్ఎక్స్‌తో ఏపీ ప్రభుత్వం చేసుకున్న ఎంవోయూలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ కళాశాలలో వసతులను సద్వినియోగం చేసుకుంటూ పూర్తి సామర్థ్యాలతో పని చేయాలన్నారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కె.భట్టి మాట్లాడుతూ 5 వేల పుస్తకాలతో గ్రంథాలయం, డిజిటల్ స్మార్ట్ బోర్డులు, అధునాతన వసతులతో ప్రయోగశాలలు, 92 శాతం మంది విద్యార్థినులకు ఉద్యోగాలు లభించాయని తమ కళాశాల ప్రత్యేకతలను వివరించారు. తమ విద్యార్థులు ఐదుగురికి జాతీయ స్థాయిలో స్కాలర్‌షిప్‌లు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు పి.ప్రజ్ఞ, జి.శిరీష, ఎస్.అరుణ, స్టూడెంట్ కన్వీనర్ వెన్నెల ప్రసంగించారు. సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

యువతకు ఉత్తమ వ్యక్తిత్వం అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, డాక్టర్ లక్ష్మీపార్వతి

ఏయూ క్యాంపస్: ఉత్తమ వ్యక్తిత్వంతో యువతరం ఎదగాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఏయూ టీడీఆర్ హబ్, తెలుగుమల్లి(ఆస్ట్రేలియా) సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ప్రవాస సాహిత్యం(తెలుగు, హిందీ, ఇంగ్లిష్) అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భాషల పరిరక్షణకు, వికాసానికి సదస్సులు ఉపకరిస్తాయన్నారు. ప్రతి విద్యార్థికి తల్లిదండ్రులే నిజమైన రోల్‌మోడల్స్‌గా నిలుస్తారన్నారు. విదేశాలలో స్థిరపడిన భారతీయులు, తెలుగు వారు రాష్ట్రానికి, భాషకు వారధులుగా నిలుస్తున్నారన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీల చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ భాషను పరిరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలుగు భాష అభివృద్ధికి ఏయూ అందిస్తున్న ప్రోత్సాహం అపారమన్నారు. విదేశాలలో తెలుగువారి సంఖ్య పెరుగుతోందన్నారు. అమెరికాలోని వంగూరి ఫౌండేషన్ నిర్వాహకులు వంగూరి చిట్టెన్ రాజు మాట్లాడుతూ జీతం కోసం ఆంగ్లం, జీవితం కోసం తెలుగు అవసరమన్నారు.